

ఆంగ్ల సంవత్సరాది సంబరం

జిల్లా అంతటా ఆంగ్ల సంవత్సరాది సంబరం వెల్లివిరుస్తోంది. ఎటు చూసినా 'హ్యాపీ న్యూఇయర్' అనే మాటలే వినిపిస్తున్నాయి. కేకులకు, పూలబొకేలకు డిమాండ్ పెరిగింది. కేకుల దుకాణాలు సైతం మంగళవారం రాత్రి కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. జిల్లా ప్రజలంతా అర్ధరాత్రి వరకు మేలుకుని 2025కు ఘనస్వాగతం పలికారు.

ఎంపీడీవోపై దాడి కేసులో...
9 మందికి రిమాండ్

గాలివీడు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో జవహర్‌బాబుపై ఈ నెల 27వ తేదీ మండల వైసీపీ నాయకులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఎంపీడీవో ఫిర్యాదు మేరకు మొత్తం 13 మంది వైసీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో 28వ తేదీ ముగ్గురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. మిగిలిన 10 మందిలో 9 మందిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వీరిలో చంద్రారెడ్డి, ధనుంజయరెడ్డి, రమణారెడ్డి, భానుమూర్తిరెడ్డి, రామాంజుల్‌రెడ్డి, ధర్మారెడ్డి, రెడ్డికుమార్, ఆంజనేయరెడ్డి, బయ్యారెడ్డిలు ఉన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లె కోర్టు జడ్జి ఎదుట హాజరుపరచగా.. న్యాయమూర్తి జనవరి 10వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. వీరిని కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

నిరంతరం పటిష్ట నిఘా ఉండాలి

- ఈవీయంల గోడౌన్‌ల తనిఖీలో కలెక్టర్



గోదాములో భద్రపర్చిన ఈవీయంలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్


రాయచోటిటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈవీయంలను భద్రపరిచిన గోదాము వద్ద 24/7 ప్రకారం నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా మంగళవారం రాయచోటి పట్టణం మార్కెట్‌యార్డులో ఉన్న అన్నమయ్య జిల్లాకు సంబంధించిన ఈవీయం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఈవీయం యంత్రాలు, బీయూలు, సీయూలు, వీవీప్యాట్‌లను అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాల్లో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారెడ్డి, కలెక్టర్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసిం హాకుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

రైల్వేకోడూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌లు తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరులోని హెచ్ఎంఎం హైస్కూలు ఆవరణలో నియోజకవర్గంలోని 397 మంది దివ్యాంగులకు మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లు, ఇతర ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నాయని.. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగులు నిత్య జీవితంలో ఆత్మస్థైర్యంతో జీవించడానికి ఉపకరణాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ వి.రవిప్రకాష్‌రెడ్డి, జిల్లా అధికారి ఆర్.బీ కృష్ణకిషోర్, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, ఎంపీడీవో నాగార్జునరావు, అధికారులు పాల్గొన్నారు.

చలో.. హార్సిలీహిల్స్

- జనవరి ఫస్ట్‌కు పర్యాటకుల దారులన్నీ అటువైపే
- ఏపీ టూరిజం.. ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లన్నీ హౌస్‌ఫుల్
- 20 వేల మంది తరలిరానున్నట్లు అంచనా



బి.కొత్తకోట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ నేడు (బుధవారం) సందర్శ కులతో కిక్కిరిసిపోనుంది. 2025 నూతన సంవత్సర ఆగమన వేడుకలకు ఈ ఆంధ్రాఊటీ వేదిక కానుంది. అన్నమయ్య జిల్లాతో పాటు అనంత పురం, శ్రీసత్యసాయి, వైయస్సార్, తిరు పతి, చిత్తూరు జిల్లాలు, కర్నాటకలోని చిక్‌బళ్లాపూర్, కోలార్ జిల్లాలకు చెందిన పర్యాటకులతో పాటు, బెంగళూరుసిటీ నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హార్సిలీహిల్స్‌కు తరలి రానున్నారు. వీరికి తోడు చుట్టుపక్కల గ్రామాల నుంచి సామాన్యులు సైతం ఒక్కరోజు సంబరం కోసం హిల్స్‌నే ఎంచుకుంటారు. గతేడాది దాదాపు 15వేల మందికి పైగా పర్యాటకులు హార్సిలీహిల్స్ సందర్శించగా ఈ ఏడాది రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా శాఖల సిబ్బంది తగిన చర్యలు తీసుకున్నారు.



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ

గెస్ట్‌హౌస్‌లు అన్నీ ఫుల్..

హార్సిలీహిల్స్‌లో ఏపీ టూరిజంకు చెందిన 56 అతిథి గృహాలు ఉండగా ఏపీటీడీసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ముంద స్తుగా బుక్ అయిపోయాయి. వీటికి తోడు అటవీశాఖ గెస్ట్‌హౌస్‌లు, ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లను వారు చెప్పిన అద్దెలు చెల్లించి బుక్‌చేసుకున్న పర్యాట కులు 31వ తేదీ రాత్రికి కొండమీదకు చేరుకొని ఉత్సాహంగా గడిపారు. తమ రూముల ఎదుట, విశాలమైన గాలిబండపైన క్యాంప్‌ఫైర్‌లు వేసుకొని పార్టీలు చేసుకుంటూ, యువకులు బైక్‌లపై కేరింతలు కొడుతూ పార్టీ మూడ్‌లో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కాగా, సందర్శకుల రద్దీకి తగ్గట్లు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచారు. జనవరి 1న ఉద యం నుంచే మదనపల్లి- హార్సిలీహిల్స్ 12, బి.కొత్తకోట, దిగువ నుంచి హిల్స్ పైకి మరో 14 బస్సులు మదనపల్లె 1డిపో నుంచి ఏర్పాటు చేశారు. వీటికి తోడు అద్దె వాహనాలు దిగువన పెద్ద సంఖ్యలో అందుబాటులో వుండను న్నాయి. ఇక హార్సిలీహిల్స్‌లో పర్యాట కుల రద్దీని దృష్టిలో వుంచుకొని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ మాలకొండయ్య ఆదేశాల మేరకు బి.కొత్తకోట సీఐ జీవన్ గంగనాథ్‌బాబు ముగ్గురు ఎస్సైలతో సహా 50 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశం అభివృద్ధి చెందాలంటే సైన్స్‌తోనే సాధ్యమవుతుందని.. ప్రతి విద్యార్థి వినూత్న ఆలోచనలతో సాంకేతికతను అందిపుచ్చుకుని శాస్త్రవేత్తగా ఎదగాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని డైట్ పాఠశాలలో నిర్వహి స్తున్న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాజెక్టుల విశేషాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లా డుతూ వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని.. విద్యార్థులం దరూ చిన్ననాటి నుండే సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించు కోవాలన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం అలవాటు చేసుకోవాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చని సూచిం చారు. ఏపీజే అబ్దుల్‌కలాం, సర్ సీవీ రామన్, కల్పనాచావ్లా, సునీతా విలియమ్స్ తదితర మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు స్వేచ్ఛగా ఆలోచించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలని సూచించారు. అనంతరం ప్రాజెక్టుల ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన 6 ప్రాజెక్టులకు సంబంధించి విద్యార్థులకు మంత్రి తన చేతుల మీదుగా మెమెం టోలను, సర్టిఫికెట్లను అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఎంపీడీవోపై దాడి హేయమైన చర్య

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి హేయమైన చర్య అని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ నేతల దాడిలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎంపీడీవోను మంగళవారం మంత్రి పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ వైద్యులకు సూచించారు. ఎంపీడీవోకు మనోధైర్యం కల్పించారు. అనంతరం ఆయన మీడి యాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగు లపై చంద్రబాబు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరిగినా సహించేది లేదని హెచ్చ రించారు. ఈయన వెంట రిమ్స్ సూపరిం టెండెంట్, జడ్పీ సీఈవో ఓబులమ్మ ఉన్నారు. అనంతరం కడప నగరంలోని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఇంటికి వెళ్లారు. ఇటీవల ఆయన కుమారుడు గుండెపోటుతో మృతిచెందడంతో ఎమ్మెల్సీని పరామర్శించారు.

గణిత సామర్థ్య పోటీ విజేతలకు బహుమతులు

చిట్వేలి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నిత్యజీవితంలో ప్రతి సందర్భంలోను గణితం ప్రాధాన్యత వహిస్తుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏబీఎన్ ప్రసాద్ తెలిపారు. చిట్వేలి ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో గణిత సామర్థ్య పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రెండు రోజుల క్రితం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏబీఎన్ ప్రసాద్ తన కుమారుడు సాయితేజ జ్ఞాపకార్థం మండలస్థాయి గణిత సామర్థ్య పోటీ నిర్వహించారు. మార్గోపల్లెకు చెందిన ఎస్.ప్రేమ్‌కుమార్ ప్రథమ,ఎస్.సౌమ్యశ్రీ ద్వితీయ, నక్కలపల్లెకు చెందిన జె.తరుణ్‌అనుదీప్ తృతీయ బహుమతి సాధించారు. కేఎస్ అగ్రహారానికి చెందిన ఎం.లిఖిత ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కాలేషా, టి.ప్రసన్నకుమార్, దుర్గరాజు, స్వామీజీ లీలావతి, గణిత ఉపాధ్యాయులు పురుషోత్తంచంద్ర, నబితారాణి, సుజాత, మహ్మద్‌రఫీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

గాలివీడు, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): సస్యరక్షణతో అధిక దిగుబడి సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారిణి గౌతమి తెలిపారు. మంగళవారం మండలంలోని గరుగుపల్లి పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులు నూర్పిళ్లు చేసేంతవరకు ఎప్పటికప్పుడు స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఏఈవో మణి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఫామీదభాను, వ్యవసాయ సహాయకులు బేబి ప్రియాంక, యా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గడువులోగా భూసమస్యలకు పరిష్కారం

- రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సంబేపల్లె: రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో అందిన ప్రతి అర్జీకి నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లె సచివాలయంలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరించి నమ్మకాన్ని కలిగించాలన్నారు. భూ బాధితులను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోరాదన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామ సభలో మంత్రి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అలి వేలమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటరత్నం, తహసీల్దార్ వెంకటేశులు, ఎంపీడీవో రామచంద్రయ్య, టీడీపీ నాయకులు నూరెకరాల రంగారెడ్డి, సహదేవరెడ్డి, దుద్యాల రవీంధర్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా బీజేపీ యువ మోర్చా రేపన శివప్రసాద్, మేస్త్రీ మందపల్లి వెంకట్రమణ, పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నాణ్యతలో రాజీపడేది లేదు

నారాయణరెడ్డిపల్లెలో రూ.32 లక్షలతో సీకే రోడ్డు నుంచి గురుకుల పాఠశాల వరకు రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం దేవరాయ నల్ల గంగమ్మ ఆలయాన్ని సందర్శించారు. దుద్యాలకు వెళుతూ చిన్నకోడివాండ్లపల్లె వద్ద పశువైద్యశాలకు తాళాలు వేసి ఉండడం గమనించి సంబంధిత డాక్టర్‌కు ఫోన్ చేసి రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం టీడీపీ నాయకుడు కోటేశ్వర్‌రెడ్డి ఇచ్చిన విందుకు హాజరయ్యారు. దుద్యాల సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి, ఎద్దుల చిన్నప్ప ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు మౌర్యారెడ్డి, నూరెకరాల రంగారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మోటకట్ల శివప్రసాద్‌రెడ్డి, అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బోనమల ఖాదర్‌వలి, రౌతుకుంట ఖాదర్‌బాషా, సుబ్బరాజుయాదవ్, జయరాం అఖండనాయక్, నాగార్జునరెడ్డి, పలువురు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం: మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్‌లో వినతిపత్రాలు స్వీకరించారు. వీఆర్‌వో నుంచి తహసీల్దార్ వరకు గ్రామాల్లో పర్యటించి భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. జనవరి 5, 6వ తేదీల్లో చిత్తూరు- రాజంపేట బైపాస్ రోడ్డులో నిర్వహించనున్న ఇజ్తిమా వేడుకలకు హాజరుకావాలని నిర్వాహకులు మంగళవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

నేడు తిరుమలరాయుడు జాతర



ప్రత్యేక అలంకరణలో తిరుమలరాయుడు

సంబేపల్లె, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలరాయగుట్టపై బుధవారం వెంకటేశ్వరస్వామి జాతర నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా ప్రతి ఏడాది ఇక్కడ జాతర నిర్వహిస్తారు. సంబేపల్లె, చిన్నమండెం వివిధ మండలాల నుంచి ప్రజలు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకుంటారు. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు భోజనం, తీర్థప్రసాదాలను అందజేస్తారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

సిద్దవటం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన భవనాసి పద్మావతి(52) సోమవారం రాత్రి తన కుమారుడు మోక్షజ్ఞతో కలిసి కడప నుంచి ద్విచక్ర వాహనంలో వస్తుండగా కనుమలోపల్లె సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడింది. దాంతో ఆమె ఎడమ కాలికి బలమైన గాయాలు తగిలాయి. ఈ విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా, ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

జిల్లా కేంద్రంలో ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మించాలి

- అన్నమయ్య జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామాంజులు

రాయచోటిటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈఎస్‌ఐ ఆసుపత్రి లేకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పర్మనెంట్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, కనీస వేతనం పొందుతూ ఈఎస్‌ఐ అమలవుతున్న కార్మిక ఉద్యోగులు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో బీడీ కార్మికుల సంక్షేమం కోసం రెడ్డీస్‌కాలనీలో ఏర్పాటు చేసిన డిస్పెన్సరీని కూడా ఎత్తి వేయడంతో ఈఎస్‌ఐ గుర్తింపు కార్డు దారులు ఇక్కట్లకు గురవుతున్నారని తెలిపారు. ఈఎస్‌ఐ కార్డు ఉండే కార్మిక, ఉద్యోగుల వేతనాల్లో ఈఎస్‌ఐ పేరుతో వేతనం కట్ అవుతున్నా వైద్య సౌకర్యం పొందలేక మళ్లీ ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో సుమారు 1500 నుండి 2 వేల మంది వరకు ఈఎస్‌ఐ కార్డుదారులుండగా, ఈఎస్‌ఐ కార్పొరేషన్‌లో పేర్లు నమోదుకానివారు వేలాది మంది ఉన్నారన్నారు. అర్హత ఉండి కార్డులేని వారందరికీ ఈఎస్‌ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామాంజులు

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీరమణ, సీఐటీయూ నాయకులు శివశంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని బీఈడీ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలి

- అన్నమయ్య జిల్లా ఏబీవీపీ కన్వీనర్ జేపీ నాగిరెడ్డి

రాయచోటిటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని బీఈడీ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని, పేపర్‌కే పరిమితమైన కళాశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏబీవీపీ అన్నమయ్య జిల్లా కన్వీనర్ జేపీ నాగిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఏబీవీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న బీఈడీ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలన్నారు. ఎన్‌సీటీఈ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలు నిర్వహిస్తున్నా యూనివర్సిటీ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. బీఈడీ కళాశాలలో ఎక్కువ శాతం విద్యార్థులు బయట రాష్ట్రాల వారిని చేర్చుకుని, వారు తరగతులకు హాజరు కాకున్నా డిగ్రీ ఇస్తున్నారన్నారు. ఏ ఒక్క బీఈడీ కళాశాలకు కూడా గుర్తింపు ఉన్న పాఠశాలతో అనుసందానం లేదన్నారు. జిల్లాలోని ఒక్క బీఈడీ కళాశాలలో కూడా లైబ్రరీ, సరైన మౌలిక వసతులు లేవన్నారు. అర్హత కలిగిన ఒక్క లెక్చరర్ లేకుండా కేవలం ధనార్జనే ధ్యేయంగా నడుపుతున్నారన్నారు. గతంలో ఇలంటి కళాశాలను గుర్తించి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టే ఇచ్చి మళ్లీ అనుమతులు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ టౌన్ సెక్రటరీ పీ. రాజా, భువనవిజయ్, హితేశ్, అభిషేక్, అజీమ్, తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏబీవీపీ కన్వీనర్ జేపీ నాగిరెడ్డి

ధోబీ ఘాట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించండి

రాయచోటిటౌన్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న ధోబీఘాట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని రజక సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఎంవీ రమణ, లక్ష్మినారాయణలు డిమాండ్ చేశారు. మంగళవారం వారు బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కరెంట్ సౌకర్యం లేక ధోబీఘాట్లలోని బోర్లు, మోటార్లు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం నీటి తొట్లు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంటున్నాయని, ఫలితంగా రజకులు దుస్తులు శుభ్రం చేయడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న ధోబీ ఘాట్లకు మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రజక యువతకు కులవృత్తి, ఫోర్ వీలర్, త్రీవీలర్‌తో సంబంధం లేకుండా వ్యాపారాలు చేసుకునేందుకు 50 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆదరణ పథకం కింద రజక వృత్తి చేసే వారికి తిరిగి పనిముట్లు ఇవ్వాలని కోరారు.

'బిట్స్ కళాశాలలో ముందస్తు వేడుకలు

రామాపురం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిట్స్ కాలేజీలో మంగళవారం బిట్స్ కాలేజీ యాజమాన్యం మన్నూరు భాస్కర్ ఆధ్వర్యంలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి జరుపుకున్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏపీఎస్ రెడ్డినాగేంద్రబాబు, విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

వీరబల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోమవరం పంచాయతీ చిలకపాటివాండ్లపల్లె సమీపంలోని మామిడితోటలో జూదమాడుతున్న ఏడుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మోహన్‌నాయక్ తెలిపారు. వారి నుంచి రూ.3,130 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, రిమాండుకు పంపనున్నట్లు ఆయన వివరించారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ల విడుదల

పెనగలూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఎంఈవో-1 గిరివరదయ్య, ఎంఈవో-2 టి.నాగసుబ్బరాయుడు యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం యూటీఎఫ్ పోరాటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, నరసింహారావు, ట్రెజరర్ మాధవ్‌మూర్తి పాల్గొన్నారు.

పుల్లంపేట : స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు చక్రధర్ రాజు, నాగతిరుమలరావు యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యలకే కాకుండా సామాజిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనడం అభినందనీయమన్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివరావు, ఎస్వీ రమణ జిల్లా కార్యదర్శి సీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై దళితులకు అవగాహన



పౌరహక్కులపై దళితులకు అవగాహన కల్పిస్తున్న వెంకట్రమణ

రామాపురం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నల్లగుట్టపల్లి పంచాయతీ హరిజనవాడలోని ప్రజలకు దళితుల హక్కులు, చట్టాలపై ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వెంకట్రమణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు సమస్యలను పరిష్కరించుకునే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సమ్మత్‌ఖాన్, వీఆర్‌వో, కోర్టు కానిస్టేబుల్ శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి



రోడ్డును చూపుతున్న గ్రామస్తులు

సుండుపల్లె, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని సామిసేనిగడ్డ మాదిగ పల్లె, మాలపల్లెవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో దాదాపుగా 100 కుటుంబాలు నివసిసున్నాయి. గతంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద సామిసేని గడ్డ నుంచి అగ్రహారం వరకు రోడ్డు మంజూరు చేయగా, పనులను అగ్రహారం నుంచి మొదలు పెట్టారు. ఈ పనులు సామినేనిగడ్డకు కొంత దూరంలో ఆగిపోయాయి. మిగిలిన రోడ్డు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు వేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను వేడుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



అభివృద్ధి కార్యక్రమాలు త్వరగా పూర్తి చేయండి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద చేస్తున్న అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మండల అధికారులను ఆదేశించారు. మంగళవారం రైల్వేకోడూరు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక పింఛన్ల పంపిణీ ప్రగతి, సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణం, గృహ నిర్మాణ ప్రగతి, ఈ క్రాప్ బుకింగ్, మిస్సింగ్ సిటిజన్స్ కేసులు, గ్రామీణ నీటిపారుదల, ఐసీడీఎస్ ప్రాజెక్టులు, వైద్యం, పశు సంవర్ధక శాఖ తదితర రంగాల్లో ప్రభుత్వ పథకాల అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉద్యోగులు ఒక లక్ష్యం పెట్టుకొని పని చేసినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. గృహ నిర్మాణ ప్రగతిపై సమీక్ష నిర్వహించి, రుణాల జాప్యంపై ఎంపీడీవో, ఏపీఎంల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ పనులపై అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్రాం తి పండుగ లోపు పనులన్నీ నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ చాంద్, ఎంపీడీవో నాగార్జున, హౌసింగ్ డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏపీఎంలు, ఏపీడీలు, పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు , వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

చిట్వేలి: చిట్వేలి మండల పరిధిలోని సిద్దారెడ్డిపల్లె, మహరాజపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సుకు కలెక్టరు హాజరై ఫిర్యాదులను పరిశీలించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దారు మోహనకృష్ణకు సూచించారు. వెంకటరాజుపల్లెలో జాతీయ ఉపాధి నిధులతో ఏర్పాటు చేస్తున్న సిమెంటు రోడ్లు, మినీ గోకులాలను పరిశీలించారు. ఎంపీడీవో మోహన్‌తో కలిసి మండల అభివృద్ధి పనులు, సమస్యలను చర్చించారు. ప్రత్యేక అధికారి గురు ప్రసాద్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభాంతుల కాలనీ ఏర్పాటు చేయాలి

రైల్వేకోడూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభా వంతులకు రైల్వేకోడూరులో ప్రత్యేకంగా కాలనీని ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పందుగోల మణి మంగళవారం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో 300 మందికి పైగా విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని తెలిపారు. వీరికి పక్కాగృహాలు, ఇంటి స్థలాలు లేవని తెలిపారు. వీరికి జీవనోపాధి కష్టంగా మారిందన్నారు. వడ్డీ లేని రుణాలు అందించాలని , ప్రైవేటు ఆస్పత్రిల్లో 50 రాయితీతో వైద్యం చేయించాలని తెలిపారు. ఏ ఇబ్బందులు లేకుండా సదరం సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. సమతానగర్‌లో 1992లో గిరిజనులకు బంజరు భూములు ఇచ్చారని, వాటికి పట్టాలు మంజూరు చేయలేదన్నారు. ఆ భూములను ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్, టీకేఎం యూ అధ్యక్ష, కార్యదర్శులు జయరాం, వినయ్, నాయకులు రమణ, బుజ్జమ్మ, వెంకటరమణ, తేజ, అంకమ్మ, గోపాల్, శంకరయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వ హయాంలో చెరువులకు జలకళ: చమర్తి



గంగమ్మకు పూజలు చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు తదితరులు

నందలూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో చెరువులు జళకళ సంతరించుకున్నాయని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. మంగళవారం నాగిరెడ్డిపల్లెలోని ఎర్రచెరువు అలుగు పారడంతో ఆయన గంగమ్మకు పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, టీడీపీ యంత్రాంగం సమష్టిగా కృషి చేసి రాజంపేట ప్రాంతంలోని ఏడు చెరువులకు నీరు తెప్పించారన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య డ్యాం డీఈ మురళీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ మధుసూదన్‌రావు, మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, పాటూరు గ్రామ అధ్యక్షుడు ముమ్మడిశెట్టి రమేష్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రేపూరి వేణుగోపాల్, నీటిసంఘం అధ్యక్షుడు బుశెట్టి వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

● జిల్లా ఖజానా అధికారి సయ్యద్ మహబూబ్

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల నుంచి లైఫ్ సర్టిఫికెట్లు జనవరి1వ తేదీ నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు సబ్ ట్రెజరీ ఆఫీస్‌లో స్వీకరిస్తామని జిల్లా అధికారి మహబూబ్ తెలిపారు. ఆన్‌లైన్‌లో బయోమెట్రిక్ విధానంలోను, జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా కూడా సమర్పించవచ్చునని తెలిపారు

రైల్వేకోడూరు మండల బీజేపీ అధ్యక్షుడుగా సాయం శ్రీధర్



సాయం శ్రీధర్‌ను సన్మానిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ అధ్యక్షుడుగా సాయం శ్రీధర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం బీజేపీ ఇన్‌చార్జి గడ్డం చంగల్‌రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు తోట శ్రీనివాసులు, వీటి చంగల్‌రెడ్డి, పందేటి శంకర్‌రాజు, వాకచర్ల సుబ్బారావు, జయప్రకాష్ నారాయణవర్మ తదితరులు పాల్గొన్నారు.

'పేద విద్యార్థుల గుండె చప్పుడు ఎస్ఎఫ్ఐ'



ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

రాయచోటిటౌన్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి విద్యార్థుల గుండెచప్పుడు ఎస్ఎఫ్ఐ అని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గురునాథ్ అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అధ్యయనం, పోరాట నినాదంతో ఎస్ఎఫ్ఐ ఏర్పాటై నేటికి 55 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. ఎక్కడైతే విద్యార్థుల సమస్యలు ఎదుర్కొంటున్నారో ఆ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించి విద్యార్థుల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకున్న సంఘం ఎస్ఎఫ్ఐ అన్నారు. . ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాయచోటి నాయకులు రెడ్డికుమార్, శివ పాల్గొన్నారు.

రైల్వే కోడూరు: రైల్వే కోడూరులో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సరేపల్లి నర సింహ, ఉపాధ్యక్షుడు లతీఫ్‌లు మాట్లాడుతూ విద్యార్థుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, గురుసాయి, చరణ్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు ఏర్పాటుకు పరిశీలన

సిద్దవటం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : దేగనవారిపల్లె ప్రభుత్వ పాఠశాల నుంచి కొండ వరకు రూ. 40 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, కల్వర్టు ఏర్పాటుకు పంచాయతిరాజ్ ఏఈ నాగరాజు మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తెలుగుదేశంపార్టీ పార్లమెంట్ కార్యదర్శి నాగముని రెడ్డి మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణానికి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం దృష్టికి తీసుకెళ్లగా, ఆయన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని, దాంతో పనులు అంచనా వేయడానికి పంచాయతిరాజ్ అధికారులు వచ్చారని ఆయన తెలిపారు.

రిటైర్డు ఉద్యోగికి సన్మానం

రాయచోటిటౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమశాఖ జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ రావును మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు సుగవాసి ప్రసాద్‌బాబు సుధాకర్‌రావు దంపతులను శాలువా, పూలమాలలతో ఘనం గా సత్కరించి, పదవీ విమరణ శుభా కాంక్షలు తెలియజేశారు. భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నేతలు శ్రీనివాసులు, మన్నేరు రామాంజనేయులు, పలువురు ఐసీడీఎస్ అధికారు లు, సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

వీఆర్వో మృతికి సంతాపం

పెనగలూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎగువ సిద్దవరం గ్రామానికి చెందిన వీఆర్వో సిద్దవరం రమేష్‌రెడ్డి(62) అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతదేహానికి పలువురు అధికారులు, అనధికారులు, రాజకీయ నాయకులు ఆయన మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. రమేష్‌రెడ్డి ప్రస్తుతం ఓబులవారిపల్లె మండలంలో వీఆర్వోగా పనిచేస్తున్నారు. మరో 3 నెలల్లో ఆయన పదవీ విరమణ చేయనున్నారని రమేష్‌రెడ్డి సోదరుడు సిద్దవరం మాజీ సర్పంచ్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.



తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లె - రైల్వేకోడూరు మధ్య ఉన్న తాత్కాలిక రోడ్డు వర్షాలకు కొట్టుకుని పోయిందని ఈ నెల 28న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురిత మైంది. దీంతో రెడ్డివారిపల్లె వంతెన కాంట్రాక్టర్ పాములపాటి ప్రసాద్ మంగళవారం తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు చేయించారు. దీంతో రెడ్డివారి పల్లె-రైల్వేకోడూరు మధ్య రాకపోక లు సులభతరమయ్యాయి.





ప్రజల ఆనందం కోసమే ముందుగా పింఛన్ల పంపిణీ



నల్లపురెడ్డిపల్లెలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి



పున్నాటివారిపల్లె అరుంధతివాడలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి రూపానందరెడ్డి

పెనగలూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు నూతన సంవత్సరాదిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ చేసిందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లె, కంబాలకుంట, బీసీ కాలనీ, సింగనమల గ్రామాల్లో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పింఛన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, జనసేన మండల ప్రధాన కార్యదర్శి గొబ్బూరు హరి, సింగనమల సర్పంచ్ వై.శివయ్య, మండల టీడీపీ నాయకులు ఎల్.రెడ్డయ్యరెడ్డి, ఊటుకూరు పాల్‌రెడ్డి, ఎం.నరసింహా, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసయ్య తదితరులు ఉన్నారు.

ఓబులవారిపల్లె: మండలంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో మల్‌రెడ్డి, టీడీపీ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, జమీర్ అక్బర్‌బాషా, వల్లీ, వేణుగోపాల్‌రెడ్డి, పయ్యావుల కోటేశ్వరరావు, రమేష్‌నాయుడు, ఈశ్వర్‌నాయు డు, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గోకులాల నిర్మాణం వేగవంతం చేయాలి : ఎంపీడీవో



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఫణిరాజకుమారి

సిద్దవటం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులతో నిర్మిస్తున్న గోకుల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఫణిరాజకుమారి తెలియజేశారు. స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం ఉపాధిహామీ సిబ్బందితో గోకుల నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో 25 గోకులాల నిర్మాణాలు జనవరి పదో తేదీ లోపు పూర్తి చేయకపోతే బిల్లులు మంజూరు కావన్నారు. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకుని పనులు వేగవంతంచేయాలని తెలియజేశారు. ఏపీవో నరసింహులు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఔషధాల నాణ్యత నిర్ధారణపై వర్క్‌షాప్



ఔషధ నాణ్యత నిర్ధారణపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపక బృందం

రాజంపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఏటీఆర్ - ఎఫ్‌టీఐఆర్ స్పెక్ట్రోస్ కాపీ అను పరికరంపై వర్క్ షాపు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. కళాశాల ఫార్మాస్యూటికల్ అనాలసిస్ విభాగం, ఐక్యూ ఏసీ విభాగం వారు సంయుక్తగా ఈ కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈ పరికరం ద్వారా వచ్చే సమాచారాన్ని విశ్లేషించి ఔషధ లక్షణాలను గుర్తించవచ్చని ఎం.మధు, సుస్మిత విద్యార్థులకు తెలియజేశారు. డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, కోశాధికారి చొప్పా అభిషేక్‌రెడ్డి, ఛైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

శాన్వి ఇంటర్నేషనల్ పాఠశాలలో ముందస్తు సంవత్సరాది వేడుకలు



కేక్ కట్ చేస్తున్న శరత్‌కుమార్‌రాజు

రాజంపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయనపల్లె శాన్వి ఇంటర్నేషనల్ పాఠశాలలో మంగళవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ కొండూరు శరత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని కోరారు. పాఠశాలలో కేక్ కట్‌చేసి పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేశారు. సీఈవో శంకర్‌రాజు, ప్రిన్సిపాల్ విజయనిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అయిన పచ్చిపులుసు మధుసూదన్ గుప్త తండ్రి సుబ్బరాయుడు, డోర్ నెం. 4/338, మెయిన్‌బజార్, రాజంపేట టౌన్ మండలం, అన్నమయ్య జిల్లా, వీరి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ అయిన వీరి భార్య ఊక కళ్యాణి @ పచ్చిపులుసు కళ్యాణి భర్త మధుసూదన్ గుప్త, డోరు నెంబరు 4/338 మెయిన్ బజార్, రాజంపేట టౌన్ మండలం, అన్నమయ్యజిల్లా వారు ఇచ్చిన సూచనల మేరకు జారి చేయు పబ్లిక్ నోటీసు ఏమనగా, నా క్లయింట్ షెడ్యూల్ దాఖల ఆస్థిలో భాగపరిష్కారం నిమిత్తమై రాజశ్రీ రాజంపేట సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో **O.S. No. 137/2022** అను దావాను పచ్చిపులుసు కృష్ణమూర్తి, పచ్చిపులుసు రాఘవేంద్రరావు మరియు ఇతరులు పై దాఖలు చేయ్యడం జరిగింది. పై తెలిపిన దావా 17.02.2025వ తేదీన విచారణకు యున్నది. సదరు షెడ్యూల్ దాఖలా ఆస్థిపై ఎలాంటి క్రయ విక్రయాలు జరపకుండ ఉండుటకుగాను **I.A. No. 486/2022** అను పిటిషన్ దాఖలు చేసి గౌరవ కోర్టు వారు షెడ్యూల్ ఆస్థిపై ఎలాంటి క్రయ విక్రయాలు జరుపకుండా ఉండుటకు ఇంజెంక్షన్ ఆర్డర్ జారి చేసియున్నారు. అయితే రాజశ్రీ వారి కోర్టులో పై తెలిపిన కేసు పెండింగ్ ఉన్న సమయంలో పై తెలిపిన ఇరువురు దావా ఆస్థిలోని 2వ ఆస్థిని ఇతరులకు లీజుబాడుగ అగ్రిమెంట్లుద్వారా ఆస్థిని పరాధినం చేయుటకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారని తెలిపివున్నది. పై తెలిపిన పచ్చిపులుసు క్రిష్ణమూర్తి పచ్చిపులుసు రాఘవేంద్రరావుతోపాటు నా క్లయింట్‌కూడా సమాన హక్కు వాటా యున్నది. కావున మా క్లయింట్ పరోక్షమున ఎవరైన క్రయ, విక్రయాలు, అగ్రిమెంట్లు, లీజుకు, బాడుగకు ఇచ్చి పుచ్చుకున్న అవి ఏ విధంగా చెల్లనేరవు. అలా జరిపిన వారిపై చట్టరీత్యా సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడును అని ఖండితముగా తెలుపడమైనది.

SCHEDULE: ITEM No. 1: House property situated at Kadapa District, Rajampet Sub-district, Rajampet Mandal, Rajampet Village, 4th ward, old door no. 4/96, new door no. 4/193, Kadapa District, Rajampet Sub-district, Rajampet Mandal, Rajampet Village, 4th ward, old door no.4/96, new door no.4/193 in Sy.no. 1001, **BOUNDARIES:** East: House of Kotapati Venkata Subbalah and Doddi vacant site West: House of Yelchuru Nadamuni and Doddi vacant site South: Vacant site of S. Sabji North: Kadapa -Madras high road. **MEASUREMENTS:** East to West: Southern side 11 1/2 sq.feets (3.49mts) Northern side: 12 1/2 sq. feets (3.80 mts) North to South: 132 sq. feets (40.04 Mts) both sides. An extent of 176 sq. yards old house measurements East to West: Southern side 1112 sq. feets (3.49mts) Northern side: 1212 sq. feets (3.80 mts) North to South: 60 sq. feets (18.20 Mts) both side 720 sq. feets with all bulbs, alamaras, windows, power meters and etc, and eastern side and western side half share in wall, Northern side and southern side full share in walls. **ITEM No.2:** R.C.C building and thatched house (Ladu danthelu) situated at Kadapa District, Rajampet sub-district, Rajampet Municipality, Rajampet Town and Grama polam 3rd ward, D.no. 3-302 in Sy.no. 981/1A3. **BOUNDARIES :** EAST: House of Manchikanti Subbamma and Bharath Kumar, WEST; House and Joint wall of patchipulusu Prakash and Chengamma. NORTH; Kadapa - Madras road, SOUTH; Sandu Rasta. Measurement of site under neath the house is 139.2 sq yards or 2 cents 872 sq links, **CONSIST OF 3 PORTIONS MEASURED BY: 1st PORTION:** EAST-WEST: Northern side -6 1/2 feets (1.98 mts). Southern side-7 1/2 feets (2.28 mts). NORTH-SOUTH: Eastern side; 34 1/2 feets (10.51 mts), Western side: 34 1/2 feets (10.51 mts) **2ND PORTION:** EAST-WEST: Northern side -14.2 feets (4.32 mts) Southern side: 13.9 feets (4.23 mts). NORTH-SOUTH: Eastern side; 21.9feets (6.62 mts) Western side: 21.9 feets (6.62 mts), **4TH PORTION:** EAST-WEST: 7 feets (2.13 mts), NORTH-SOUTH: 19.9 Feets (6.01 mts). Total 1 to 4 items are 139.02 sq. yds or Ac.0.02 872 sq links along with thatched house and building doors, alamaras, power bulb, power meter, western side joint wall with easementary rights.

పి. వల్లభరావు, అడ్వకేట్, రాజంపేట

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ పామిలేటి

వాల్మీకిపురం, డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): రైతుల భూసమస్యల సత్వ ర పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోం దని వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటి పేర్కొన్నారు. మంగళవా రం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వినతులు స్వీకరించి వారితో చర్చించారు. ప్రభుత్వ భూములను ఆక్రమణలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయ న్నారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ లక్ష్మీప్రసన్న, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, కూటమి పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : మండలంలోని కాట్నగల్లు గ్రామంలో మంగళవా రం జరిగిన రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలపై 60 అర్జీలను ప్రజలు అధికారులకు అందజేశారు. రెవెన్యూ సదస్సుకు నోడల్ అధికారిగా మండల విద్యాశాఖాధికారి గౌస్‌పీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీరాములు నాయక్ మాట్లాడుతూ ప్రజల నుంచి 6 రెవెన్యూకు సంబంధిం చి 16 అర్జీలు వచ్చాయని మిగతా అర్జీలు పెన్షన్లు, ఇంటి పట్టాల కొరకు శ్మశానవాటిక సమస్యలు రేషన్‌కార్డులు ఇతర పలు సమస్యలపై అర్జీలను వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఆర్ఐ బాలాజీ, మండల సర్వేయర్ శ్రీవాణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ దోపిడి నుంచి ప్రజలకు రక్షణ కల్పించడానికే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ పేర్కొన్నారు. మండలంలోని నాయనిచెరువుపల్లెలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ భూ బాధితులు రెవెన్యూ సదస్సులో వినతులు సమర్పించి పరిష్కారం పొందాలన్నారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ ప్రదీప్, నాయకులు జనార్ధన్‌రెడ్డి, రెడ్డెప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు హరికుమార్ తెలిపారు. మంగళవారం కన్నెమడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 7 వినతులు వచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ రికార్డులలో సవరణ కొరకు 3 అర్జీలు, పించను మంజూరు చేయాలని 4 వినతులు వచ్చినట్లు తెలిపారు. అర్జీలను పరిశీలించి సకాలంలో పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీటి రవినాయక్, ఆర్ఐ ముద్దుక్రిష్ణయాదవ్, ఎప్‌బీవో రామరాజు, దేవదాయశాఖ రికార్డు అసిస్టెంట్ కొండకిట్ట, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

దుస్థితిలో గ్రామీణ రహదారులు



అధ్వాన స్థితిలో మందలవారిపల్లి రోడ్డు

పెద్దమండ్యం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) గ్రామీ ణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారడం తో ప్రజలు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. ఎప్పుడో సుమారు 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన రోడ్లు బాగా దెబ్బతిని కంకర బయటపడడంతో వాహన దారులు అటు వెళ్లాలంటే హడలిపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. పెద్దమండ్యం మండలం లో మారుమూల ప్రాంతమైన మందలవారిపల్లి-కొట్టాల మార్గంలో మందలవారిపల్లి ఎర్రగుట్టప ల్లి, దండేవారిపల్లి, ధేనేనాయక్‌తండా, అవికేనాయ క్ తండా, షేకేనాయక్‌తండా, గరుగుమీదతండా, చిగురుమానుతండా, వడ్డివంకతండా గ్రామాల ప్రజలు నిత్యం రవాణా చేస్తుంటారు. ప్రధాని మంత్రి సడక్ యోజన పథకం ద్వారా 19 ఏళ్ల క్రితం తారురోడ్డు వేశారు. ఆ తరవాత వర్షాలకు దెబ్బతింటూ రావడం చిన్నచిన్న మరమతులు సైతం నోచుకోకపోవడంతో తారురోడ్డు ఉనికి కోల్పోయింది. ప్రస్తుతం అడుగు అడుగునా గుంత లు ఏర్పడడంతో రోడ్డుపై వెళ్లాలంటే వాహనదా రులు భయపడిపోతున్నారు. తంబళ్లపల్లి నుంచి మందలవారిపల్లి కు ఉదయం వేళల్లో ఒక సింగిల్ ఆర్టీసీ బస్సు వస్తుంది ఆ సమయం దాటితే కాలి నడక తోనే ముందుకు సాగాలని గిరిజన వాసులు వాపోతున్నారు. ద్విచక్రవాహనాల్లో ప్రయాణం కూ డా కష్టంగా మారింది. చిద్రమైన ఈ మార్గంలో ప్రయాణం నరకయాతంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఈ మార్గంలోని కాజ్‌వేలు పూర్తి గా దెబ్బతింటే ప్రయాణాలు ఆగిపోతాయని ప్రజ లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత దుస్థితిలో ఉన్న తారురోడ్డు మండలంలో ఎక్కడా లేదని పలువురు పెదవివిరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని తారురోడ్డును నిర్మించి గ్రామీణ ప్రజలకు ముఖ్యంగా గిరిజన ప్రజలకు ఇబ్బందులు లేకుం డా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పనులకు ప్రతిపాదనలు పంపాం

మందలవారిపల్లి తారురోడ్డు పునర్నిర్మాణ పనుల కు ప్రతిపాదన పంపించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే తారురోడ్డు పనులు వెంటనే ప్రారంభిస్తాం. ప్రస్తుతం తారురోడ్లకు మరమ్మతు పనులు ప్రారంభించాం. ఈ వర్షాల వల్ల మరమ్మ తుల పనులు కూడా ఆపేశాం.

-బోరయ్య, రోడ్లు, భవనాల శాఖ ఇన్‌చార్జ్ ఏఈ తంబళ్లపల్లి నియోజకవర్గం

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి



నవజీవన్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కురవంక సర్పంచ్ చలపతి

మదనపల్లె టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న గొంగడి కృష్ణమూర్తి ఆదర్శంగా నిలుస్తున్నారని కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయంలో నవజీవన్ క్యాలెండర్లను చలపతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి షబీనా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గణిత సామర్థ్య పోటీ విజేతలకు బహుమతులు

చిట్వేలి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నిత్యజీవితంలో ప్రతి సందర్భంలోను గణితం ప్రాధాన్యత వహిస్తుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యుడు ఏబీఎన్ ప్రసాద్ తెలిపారు. చిట్వేలి ఉన్నత పాఠశాల లో మంగళవా రం నిర్వహించిన కార్యక్రమంలో గణిత సామర్థ్య పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రెండు రోజుల క్రితం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏబీఎన్ ప్రసాద్ తన కుమా రుడు సాయితేజ జ్ఞాపకార్థం మండల స్థాయి గణిత సామర్థ్య పోటీ నిర్వహిం చారు. మార్గోపల్లెకు చెందిన ఎస్.ప్రేమ్ కుమార్ ప్రథమ,ఎస్.సౌమ్యశ్రీ ద్వితీయ, నక్కలపల్లెకు చెందిన జె.తరుణ్ అనుదీప్ తృతీయ బహుమతి సాధించారు. కేఎస్ అగ్రహారానికి చెందిన ఎం.లిఖిత ప్రోత్సాహక బహుమతి అందుకు న్నారు.

మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ ఉద్యోగుల నేతలు, ప్రజా సంఘాల నాయకులు

పీలేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బీసీ మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఆ మేరకు మంగళవారం పీలేరులో రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, వివిధ ప్రజా సంఘాల నాయకులు ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా బీసీ ఉద్యో గుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ రాయల బాబురాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 1980 డిసెంబరు 31న 40 సిఫార్సులతో కూడిన నివేదికను మండల్ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి అందజేసిందని, నివేదిక అందిన 10 ఏళ్ల తరువాత స్వర్గీయ ప్రధాని వీపీ సింగ్ ప్రభుత్వం కేవలం ఒక సిఫా ర్సు అయిన కేంద్ర విద్య, ఉద్యోగ నియామకాల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పిం చిందని మిగిలిన 39 సిఫార్సులు నేటికీ అమలుకు నోచుకోలేదని వాపోయారు. మం డల కమిషన్ సిఫార్సులపై పార్లమెంటులో చర్చ జరపాలన్నారు. అనంతరం వారు డిప్యూటీ తహసీల్దారు సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గుర్రం నారాయణ, చీకటిపల్లె రామాంజులు, నక్కా వెంక టరమణ, మల్లేపల్లె రామచంద్రయ్య, రమేశ్, రమణ, నారాయణ, లోకనాథం, రామ కృష్ణ, రాజేశ్, శివానందన్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలి



విలేకరులతో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామాంజులు

రాయచోటిటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రి లేకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పర్మనెంట్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, కనీస వేతనం పొందుతూ ఈఎస్ఐ అమలవుతున్న కార్మిక ఉద్యోగులు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో బీడీ కార్మికుల సంక్షేమం కోసం రెడ్డీస్‌కాలనీలో ఏర్పాటు చేసిన డిస్పెన్సరీని కూడా ఎత్తి వేయడంతో ఈఎస్ఐ గుర్తింపు కార్డు దారులు ఇక్కట్లకు గురవుతున్నారని తెలిపారు. ఈఎస్ఐ కార్డు ఉండే కార్మిక, ఉద్యోగుల వేతనాల్లో ఈఎస్ఐ పేరుతో వేతనం కట్ అవుతున్నా వైద్య సౌకర్యం పొందలేక మళ్లీ ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో సుమారు 1500 నుండి 2 వేల మంది వరకు ఈఎస్ఐ కార్డుదారులుండగా, ఈఎస్ఐ కార్పొరేషన్‌లో పేర్లు నమోదుకానివారు వేలాది మంది ఉన్నారన్నారు. అర్హత ఉండి కార్డులేని వారందరికీ ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీరమణ, సీఐటీయూ నాయకులు శివశంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హెల్మెట్లు, సీటు బెల్టులు తప్పనిసరి



కలికిరిలో బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు

కలికిరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు, ఇత ర పెద్ద వాహనదారులు సీటు బెల్టులు బుధవారం నుంచి తప్పనిసరిగా ధరిం చాలని కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు అవగాహన కల్పించడం కోసం మంగళవారం పట్టణంలో పోలీసులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీ సర్కిల్ నుంచి యల్లమ్మ ఆలయం వరకూ ఈ ర్యాలీ కొనసాగింది. పలు కూడళ్లలో వాహనదారులకు అవగాహన కల్పించారు. హైకోర్టు ఆదేశాల మేరకు వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించి తీరాలని, అతిక్రమించిన వారిని ఉపేక్షించబోమని కూడా సీఐ తెలిపారు.పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదుండ్రులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు పత్రాలు దగ్గర వుంచుకోవాలని సూచించారు. కొత్తగా అమల్లోకి రానున్న ట్రాఫిక్ నియమాల ప్రకారం ఉల్లంఘనలకు పాల్పడిన వారికి జరిమానాలు విధించి కేసులు నమో దు చేస్తామని చెప్పారు. ఈ ర్యాలీ, అవగాహనా కార్యక్రమాల్లో పలువురు ఏఎస్ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

మదనపల్లె, డిసెంబరు 31: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజాప్రతిని ధులు, నాయకులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరాంచినబాబు, జనసేన నేతలు గంగారపు రామ్‌దాస్‌చౌదరి, టీడీపీ నేతలు కోహూరి మల్లికార్జుననాయుడు, మార్పూరి సుధాకర్‌నాయుడు, మైనార్టీనేతలు ఎస్‌ఏమస్తాన్, పఠాన్ ఖాదర్‌ఖాన్‌లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త ఏడాది అందరి కుటుంబాల్లో వెలుగులు నింపాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని బీజేపీ నేత జబ్బల శ్రీనివాసులు, జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు ఆకాంక్షించారు.

నిమ్మనపల్లిలో: మండల ప్రజలకు, టీడీపీ నాయకులకు పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరమణ నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల ప్రజలు పాడి పంటలతో శుభ సంతోషాలతో ఉండాలని మాజీ జడ్పీటీసీ వసంతమునిరత్నం, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సుధాకర్‌రావు, మాజీ ఎంపీపీ రెడ్డెప్పరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆర్టే వెంకటేష్, జిల్లా బీసీ సాధకారత సమితి అధ్యక్షుడు లక్ష్మన్న, మాజీ సర్పంచ్ రమణ. శ్రీరాములు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త ఏడాదికి ఆలయాలు ముస్తాబు

గుర్రంకొండ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు ఆలయాలు నూతన సంవత్సరానికి రంగు రంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఇందులో భాగంగా తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరిం చారు. అలాగే చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో కూడా నూతన సంవత్సరం సంద ర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అనుగుణంగా ఆలయాల వద్ద తగిన ఏర్పాట్లు చేశారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

వీరబల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మం డల పరిధిలోని సోమవరం పంచాయతీ చిలకపాటివాండ్లపల్లె సమీపంలోని మా మిడితోటలో జూదమాడుతున్న ఏడుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ మోహన్‌నాయక్ తెలిపారు. వారి నుంచి రూ.3,130 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, రిమాండుకు పంపనున్నట్లు ఆయన వివరించారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

పీలేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): 2025 ఏడాదికి యూటీఎఫ్ రూపొందించిన క్యాలెండర్, డైరీని మంగళవారం పీలేరు ఎంఈవోలు లోకేశ్వర రెడ్డి, పద్మావతమ్మ ఆవిష్కరించారు. యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా సహాధ్యక్షులు శివారెడ్డి, కార్యదర్శి అక్రం బాషా తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి

రామసముద్రం, డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని చొక్కాండ్లపల్లె ప్రాథమి కోన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయు డు ప్రభాకర్‌రావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఎంఈవో హేమ లత అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసంద ర్భంగా ప్రభాకర్‌రావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, మండల అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికే కాకుండా సామా జిక సేవా కార్యక్రమాలు కూడా ప్రభాకర్‌రావు చేపట్టినట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రభాకర్‌రావుకు మండల ఎస్టీయూ సభ్యులు, ఉపాధ్యాయులు శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామసముద్రం, కేసీపల్లె, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, చొక్కాండ్లపల్లె ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, జనార్దన్‌రెడ్డి, మునుస్వామినాయక్, మస్తాన్‌బీ, సందీప్, వేదవతి, ఎస్టీయూ నేతలు శ్రీధర్, శ్రీరాము లురెడ్డి, శ్రీనివాసులు, సురేష్, మహీధర్‌రావు, మధుసూదన్, మనోహర, శంకర, జగన్నాథ రెడ్డి, కేశవకుమార్, నరసింహులు, ప్రకాష్‌రెడ్డి, చంగ్రాయచారిఉన్నారు.


ఉపాధ్యాయుడు ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న ఎంఈవో, ఎస్టీయూ సభ్యులు

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

రామసముద్రం, డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఇద్దరు లబ్ధిదా రులకు సీఎం సహాయనిధి కింద ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చెక్కులు పంపిణీ చేశారు. మండలంలో మంగ ళవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పింఛన్ పంపిణీతో పాటు ఊలపా డుకు చెందిన ఆంజమ్మకు సీఎం సహాయనిధి కింద రూ.లక్ష నాలుగువేలు, కమతంపల్లెకు చెందిన ప్రభావతికి రూ.51వేలు చెక్కులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు విజయ్‌కుమా ర్‌గౌడు, మాజీ జడ్పీటీసీ శివశంకర్, నాయకులు స్థానికం రాజేష్, చిన్నస్వామి, బోయ రమణ, రమేష్, రూపేష్‌రెడ్డి, కృష్ణప్ప, బాలాజి, సీసీ డైరెక్టర్ శ్రీనివాస్, శివారెడ్డి, శీన, ఎంపీడీవో భానుప్రసాద్, ఏపీవో గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో భగ్గుమన్న తిమ్మాపురం

పీలేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పాత కక్షల కారణంగా కేవీపల్లె మండలంలోని తిమ్మాపురం వడ్డిపల్లె మంగళవారం భగ్గుమంది. వడ్డిపల్లెలోని ఇరువర్గాల మధ్య గత కొన్నేళ్లుగా పాతకక్షలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి ఘర్షణలు చెలరేగడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. దీంతో రంగప్రవేశం చేసిన కేవీపల్లె పోలీసులు 34 మందిపై కేసు నమోదు చేసి గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు. కలకడ సీఐ గురునాథ్, కేవీపల్లె ఎస్ఐ చిన్నరెడ్డప్ప తిమ్మాపురంలో మకాం వేసి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వాహనం సహా ఎర్ర దుంగలు స్వాధీనం

పీలేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వాహనంతో సహా 6 ఎర్రచందనం దుం గలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్ వో గురుప్రభాకర్ మంగళవారం తెలిపారు. ఎర్రచందరం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. పీలేరు వైపు నుంచి వచ్చిన ఏపీ03 సీఈ 4221 నెంబరు గల కారులోని వారు తమను చూసి పారిపోయారన్నారు. కారును తనిఖీ చేయగా 62 కేజీలు బరువున్న 6 ఎర్రచందనం దుంగలు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కారు నెంబరు ప్లేట్లు లభించాయన్నారు. దీంతో కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పారిపోయిన వారి కోసం గాలింపు ముమ్మరం చేశామన్నారు. ఈ దాడిలో తనతోపాటు ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి


ములకలచెరువు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో జనవరి 5,6,7వతేదీల్లో జరిగే అఖిల భారత దళితుల హక్కుల ఉద్యమం రెం డవ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంచాల హరికు మార్, మండెం సుధీర్‌కుమార్ కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో మంగళవారం జాతీయ మహాసభలకు సంబంధించిన కరప త్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, బాస్ జిల్లా నాయకుడు మంత్రాల రమణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

గాలివీడు, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): సస్యరక్షణతో అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారిణి గౌతమి తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులతో మాట్లాడారు.






















గోకులాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

కలకడ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద మంజూరైన గోకులా ల నిర్మాణాలను త్వరగా పూర్తయ్యేలా చూడాలని డ్వామా పీడీ వెంకటరత్నం సిబ్బం దిని ఆదేశించారు. మంగళవారం ఆయన కేదొడ్డిపల్లె, గంగాపురం, దేవలపల్లెలో జరు గుతున్న పనులను తనిఖీ చేశారు. మండలానికి 60 గోకులాలు, మినీగోకులాలు వివిధ దశలో ఉన్నందున సంక్రాంతి పండుగ నాటికి పశువులకు ఉపయోగపడేలా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏపీవో చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.





పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ములకలచెరువు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తంబళ్లప ల్లె నియోజ కవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరి పల్లి జయచంద్రారెడ్డి పేర్కొ న్నారు. మండలంలోని నాయ నిచెరువుపల్లెలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా ఫించన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఫించన్లను పెంచి ప్రతి నెలా అంది స్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. అలాగే స్థానిక పార్టీ కార్యాలయం లో కోనేటివారిపల్లె పంచాయతీ ఏనువారిపల్లెకు చెందిన భాగ్యమ్మకు రూ.30వేలు సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, నాయకులు జనార్ధన్‌రెడ్డి, రెడ్డెప్ప, చంద్రశేఖర్, సుబ్బినాయుడు, నాగిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఎర్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: టీడీపీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని తంబ ళ్లపల్లి నియోజకవర్గం టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, టీడీపీ పరిశీల కుడు సీడ్ మల్లికార్జున నాయుడు కోరారు. మండలంలోని కలిచెర్ల లో మం గళవారం ఎన్‌టీఆర్


నాయనిచెరువుపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

భరోసా పింఛన్‌లను అధికారులతో కలిసి వారు పంపిణీ చేశారు. కూటమి నేతలు జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాధరెడ్డి, సయ్యద్, బెజవాడ శేషాద్రి, రామకృష్ణారెడ్డి, చలపతినాయుడు మోహన, కాలేషా, నాగేశ్వరరెడ్డి, హసీంసాబ్, నాగార్జున, శంకరరెడ్డి, ప్రభాకరరెడ్డి అధికారులు, జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తంబ ళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. మంగ ళవారం ఆయన మండలంలోని కోటకొండలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పం పిణీ కార్యక్రమంలో పాల్గొన్నా రు. కార్యక్రమంలో నియోజక వర్గ టీడీపీ సమ న్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, రాష్ట్ర బీసీ నాయకుడు తులసీధర్ నాయుడు, పార్లమెం ట్ బీసీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరి శీన, గురుమూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రెడ్డప్ప, రాజేష్, జయరాంరెడ్డి, బీసీ నాయకుడు మదన నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాయపడిన డ్రైవర్‌కు ఆర్థిక సాయం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెనియోజకవర్గంలో పెద్ద మండ్యెం మండలంలో 108 వాహన టైర్‌పేలి డ్రైవర్ అంజికి కన్ను పూర్తిగా దెబ్బ తగిలింది. ఈ సమాచారం తెలుసుకున్న అన్నమయ్య జిల్లా యూని యన్ నాయకులు జిల్లాలోని ఉద్యోగులు తరఫున రూ.20 వేలు కలిచెర్లలోని అంజి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్వీ రమణ, చలపతి, జస్వంత్, వెంకటరమణ, రామాంజులు, ప్రభాకర్, నాగేంద్ర, శ్రీనాథ్ పాల్గొన్నారు.

మరో ఘటనలో బాధితుడికి సాయం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో మృతి చెందిన జనసైనికుడు ఆంజనేయులు కుమారుడు శివప్రసాద్ (28) కుటుంబసభ్యులను కలిసి జనసేన రాష్ట్ర కో కన్వీనర్ రాందాస్ చౌదరి, ఉమ్మడి చిత్తూరుజిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం రూ.5వేలు వితరణ చేశారు. పార్టీ అధినాయకులతో మాట్లాడి పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా వారి కుటుం బ సభ్యలను ఆదుకొంటామన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆటో-బైకు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పీటీఎం మండలం కొండువారుపల్లెకు చెందిన నారాయణ(60),రణదీప్(19)లు బైకు పై కొండువరిపల్లె నుంచి మద్యగారిపల్లెకు వస్తుండగా వారి బైకును ఆటో ఢీకొట్టింది. ఈ సంఘటనలో నారాయణ, రణదీప్ గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పీటీఎం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.













కలికిరి రానున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి

కలికిరి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి శుక్రవారం కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప తెలిపారు. ఈ మేరకు ఆయన పర్యటన కార్యక్రమాన్ని వెల్లడించారు.



స్కిల్ హబ్ సెంటర్ ఏర్పాటుకు టీఎన్ బంగ్లా పరిశీలన

తంబళ్లపల్లె, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తం బళ్లపల్లెలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పా టు చేయడానికి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ టీఎన్ బంగ్లాను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం సబ్ కలెక్టర్ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి నాగార్జునతో కలసి మండల కేంద్రంలో ఉన్న టీఎన్ బంగ్లాను సందర్శించి భవనంలోని గదు లు, ఆవరణం, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికా రి మాట్లాడుతూ..స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో టైలరింగ్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సు, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు, జూనియర్ సాఫ్ట్ వేర్ తదితర కోర్సులలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. తహసీల్దారు హరికుమార్, ఆర్ఐ ముద్దుక్రిష్ణ, సర్వేయర్ గణేష్, స్కిల్ హబ్ సెంటర్ సిబ్బంది చౌడయ్య, రఫీ పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ హక్కులను కాపాడటంలో నిర్లిప్తత వద్దు

మదనపల్లె టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం కల్పించిన హక్కులను, రిజర్వేషన్లను కాపాడ టంతో అధికారులు నిర్లిప్తత కనపర చవద్దని బాస్ వ్యవస్థాపకుడు పీటీ ఎం శివప్రసాద్, ఎమ్మార్పీఎస్ నేత నరేంద్రబాబు పేర్కొన్నారు. మంగళ వారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అధ్యక్షతన డివిజన్ స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ జనాభా గణన సర్వేలో కొందరు కింది స్థాయి సిబ్బంది సక్రమంగా సర్వే చేయ డం లేదని, మాదిగ ఉపకులాల బదులు ఆది ఆంధ్ర, తదితర కులాల పేర్లు నమోదు చేస్తున్నారని వాపోయారు. మండలాల్లో విజిలెన్స్ మానిటరింగ్, పౌర హక్కుల కమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించలేదన్నారు. దళితులకు ప్రత్యేకంగా శ్మశానవాటిక స్థలాలు కేటాయించాలని కోరారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం మాట్లాడుతూ మదనపల్లెలో అంబే ద్కర్ భవనానికి కేటాయించిన స్థలం ఆక్రమణలకు గురవుతోందన్నారు. బహు జన సేన అధ్యక్షుడు శ్రీచందు మాట్లాడుతూ పోలీసులు కక్ష సాధింపుతో తనపై కేసులు నమోదు చేసి రౌడీషీట్ తెరిచారని, దీనిపై డీఎస్పీ విచారించి రౌడీషీట్ తొలగించాలని కోరారు. పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ వేంపల్లె గ్రామంలో ప్రతి ఏటా వినాయకచవితి సందర్భంగా దళితులపై దాడులు జరుగుతున్నాయని, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ కొండయ్యనాయుడు, డీఏవో రాఘవేంద్ర, 11 మండలాల అధికారులు, డీవీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో సభ్యుల సమస్యలను తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

రేపు మొక్కల పంపిణీ కార్యక్రమం

మదనపల్లె, డిసెంబరు 31: మదనపల్లె నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో గురువా రం నుంచి మొక్కల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సంక ల్పించిన ఏడు అంశాల్లో ఒకటైన పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగంగా ఇంటింటాచెట్టు- ఊరంతా వనం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పర్యావరణంతోపాటు ఆర్థికంగా చేయూత నిచ్చే ఎర్రచందనం, టేకు, అల్లనే రేడు, తదితర రకాలకు చెందిన 25వేల మొక్కలను నియోజకవర్గ వ్యాప్తంగా రైతుల కు పంపిణీ చేయనున్నట్లు ఆయన వివరించారు. జనవరి 2న ఉదయం 10గంటలకు జరిగే ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్ర సాద్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

డీలర్ల ఎంపికకు రాత పరీక్ష

మదనపల్లె టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో ఖాళీగా వున్న చౌక దుకాణాల డీలర్ల ఎంపిక కోసం రాత పరీక్ష నిర్వహించారు. మంగళవారం స్థానిక బీటీ కళాశాలలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన రాత పరీక్షకు 367 మం దికి గాను 343 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతులను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. సాధ్య మైనంత వరకు రెండు రోజుల్లో పరీక్ష పేపర్లను దిద్ది అర్హులైన వారిని ఇంటర్వ్యూకు పిలుస్తామని సబ్‌కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఇన్‌చార్జి డీఏఓ రాఘవేంద్ర, సీఎస్ డీటీ ఫిరోజ్, కుమారి, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐ శేషాద్రిరావు పాల్గొన్నారు.







ఎస్సీ కులగణన క్షేత్రస్థాయిలో చేపట్టాలి


పీలేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్సీ కులగణనను క్షేత్రస్థాయిలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని పీలేరులోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. పీలేరులో మంగళవారం ఎంఆర్ పీఎస్ పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గండికోట వెంకటేశ్ మాట్లాడుతూ కొన్ని సచివా లయాల సిబ్బంది ఎస్సీ కులాల జాబితాను తమ కార్యాలయాలలోని నోటీసు బోర్డులకు అతికించేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. తమ పరిధిలోని గ్రా మాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో ఉన్న సమాచారాన్ని ప్రభుత్వానికి అందజేయడంలో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఎస్సీ గ్రామాలకు వెళ్లి సబ్-క్యాస్ట్ మేరకు పరి శీలించి ప్రభుత్వం అందజేసిన జాబితాలో ఏవైనా తప్పులు దొర్లి ఉంటే సరిజేయాల ని కోరారు. ఈ మేరకు ఈవోపీఆర్‌ఆర్‌డీ లతీఫ్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండికోట రెడ్డి కుమార్, నరసింహ, రాము, గంగాధర్ పాల్గొన్నారు.


ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మదనపల్లె విద్యార్థి


పురుషోత్తంను అభినందిస్తున్న గురుప్రసాద్

మదనపల్లె టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో శ్రీలంక-ఇండియా జట్ల మధ్య నిర్వహించిన త్రోబాల్ సిరీస్‌లో ఇండియా జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈనెల 29న తమిళనాడు రాష్ట్రం హోసూరులో నిర్వహించిన అంతర్జాతీయ సిరీస్‌లో శ్రీలంక జట్టుతో ఇండియా జట్టు తలపడింది. ఇందులో 6-4 పాయింట్లతో ఇండియా జట్టు రన్న రప్‌గా నిలిచింది. కాగా ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఏడుగురు క్రీడాకారుల్లో మదనపల్లె శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు చెందిన రెండో సంవత్సరం విద్యార్థి పురుషోత్తం ఉన్నారు. మార్చిలో శ్రీలంకలో నిర్వహించనున్న అంతర్జాతీయ త్రోబాల్ టోర్నమెంట్‌కు ఇండియా జట్టు తరఫున పురుషోత్తం పాల్గొననున్నాడు. మంగళవారం హోసూరు నుంచి తిరిగి వచ్చిన పురుషోత్తంను కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి అభినందించారు. అతని కోచింగ్ కోసం రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు.







గతం మరిచారా అన్నా!

● జడ్పీ సమావేశంలో

ఎమ్మెల్యే ద్వారకపై జగన్, మురళి వ్యంగ్యాస్త్రాలు

చిత్తూరు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విమర్శలు ప్రతివిమర్శలతో చిత్తూరు జడ్పీ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. గత సమావేశాలతో పోల్చితే మంగళవారం జరిగిన ఈ సమావేశం భిన్నంగా సాగింది. తంబళపల్లె నియోజకవర్గంలో జడ్పీటీసీలను, ఎంపీపీలను, ఎంపీటీ సీలను ఏ సమావేశాలకూ హాజరు కానివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఆరోపించారు. దీనిపై స్పందించిన చిత్తూరు ఎమ్మె ల్యే గురజాల జగన్ 'రాష్ట్రానికి 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన మా నాయకుడు చంద్రబాబు పైనే రాళ్లు వేసి దారుణంగా అడ్డుకున్నారే, దాంతో పోలిస్తే మీరు చెప్పేది అసలు విషయమే కాదునా' అనడంతో సభలో నవ్వులు విరిశాయి. మీ నాయకుడి(జగన్)లా మా నాయకుడు(చంద్రబాబు) చూసీచూడనట్లు వదిలేసి ఉంటే వైసీపీ సభ్యులు సమావేశానికి వచ్చేవారా? గొడవకు దిగేవారా అని నవ్వుతూ స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. 'మా నాయకుడు క్రమశిక్షణకు మారుపేరు కాబట్టే ఈ సమావేశం అధికార, ప్రతిపక్ష సభ్యులతో జరుగు తోంది. లేదంటే వేరే మాదిరిగా ఉండేది'అని వైసీపీ సభ్యులకు ఘాటుగా సమాధానం చెప్పారు.

ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు మీకేది?

తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరు మాట్లా డినా కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి విమర్శించారు. దీనిపై పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ స్పం దిస్తూ.. 'వైసీపీ హయాంలో రైతు నుంచి కూలీ వరకు ఎవర్నీ వదలకుండా సుమారు 600మందికి పైగా కేసులు పెట్టి ఊర్లోకి వచ్చేదానికే భయపడేలా చేశారే! అప్పుడు ఎందుకు ఇవి మాట్లాడలేదనా' అని వ్యంగ్యంగా ప్రశ్నించారు.'బలవంతపు ఏకగ్రీవాలతో దౌర్జన్యంగా ఎన్నికైన జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు ప్రజాస్వామ్యం అంటూ మాట్లాడడం విడ్డూరంగా ఉంది' అని ఎద్దేవా చేశారు.





